సాక్షి
ఆదిలాబాద్
బుధవారం । 25 । అక్టోబర్ । 2023

జమ్మి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న తదితరులు



గరిష్టం/కనిష్టం
33.0/28.0

**వాతావరణం**
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. ఉదయం పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

## న్యూస్‌రీల్

### సనాతన ధర్మాన్ని కాపాడాలి



ర్యాలీలో పాల్గొన్న ధర్మ సమాజ్ కార్యకర్తలు

ఇచ్చోడ: సనాతన ధర్మాన్ని కాపాడాలని వైష్ణవ సదన్ పీఠాధిపతి నారాయణ్ మహరాజ్ అన్నారు. దసరా సందర్భంగా మండల కేంద్రంలో సనాతన ధర్మ సేవాసమితి స్థాపన కార్యక్రమంలో భాగంగా మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. సమితి స్థాపన ఆధ్వర్యంలో వెయ్యి మంది కార్యకర్తలు స్థానిక విఠలేశ్వర మందిరం నుంచి ర్యాలీ చేపట్టారు. అన్నాభావు సాఠే, తల్లి తెలంగాణ, కుమురం భీం, అంబేద్కర్, శివాజీ, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాదయాత్రగా పట్వారిగూడ వరకు వెళ్లారు. ఇందులో సనాతన ధర్మ సమాజ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఖండేవ్ ఆలయంలో 'తొడసం' పూజలు



పూజలు చేస్తున్న తొడసం వంశస్తులు

నార్నూర్: దసరా పండుగ సందర్భంగా మండలకేంద్రంలోని ఖండేవ్ ఆలయంలో తొడసం వంశస్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయ పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్, ఆలయ కమిటీ సభ్యుడు తొడసం నాగోరావు మాట్లాడు తూ, దసరా సందర్భంగా ఏటా పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో తొడసం వంశపెద్దలు తెలంగాణరావు, రాజు, ఆనందరావు, భీంరావు, గంగారాం, జంగు, దేవురావు, యాదవ్‌రావు,రామారావు పాల్గొన్నారు.

### జగదాంబదేవికి పూజలు



శుద్ధజలాన్ని తీసుకెళ్తున్న యువతులు

బోథ్: దసరా పురస్కరించుకుని మండలంలోని సాకెర గ్రామంలో యువతులు జగదాంబ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజులుగా నియమ నిష్టలతో పూజలు నిర్వహించాక మంగళవారం శుద్ధజలం తీసుకువెళ్లి జగదాంబ మాత నూతన వస్త్రాలు, ఆభరణాలను శుద్ధి చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

### ఆర్టీసీని ఆదరించండి



గ్యారేజీలో పూజలు చేస్తున్న డీఎం కల్పన

ఆదిలాబాద్: ఆర్టీసీని ఆదరించాలని ఆదిలాబాద్ డీఎం కల్పన అన్నారు. విజయ దశమి సందర్భంగా డిపో కార్యాలయంతో పాటు గ్యారేజీలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పండుగ సందర్భంగా ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంఎఫ్ రాజేందర్, శ్రీరాం, డిపో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



రామ్‌లీలా మైదానంలో రావణ దహన ప్రక్రియ



దసరా మైదానంలో రావణ దహన దృశ్యం



రావణదహన ఘట్టాన్ని సెల్‌ఫోన్‌లో బంధిస్తూ..

# వైభవంగా విజయదశమి

- అట్టహాసంగా దసరా వేడుకలు
- ప్రత్యేక ఆకర్షణగా రావణ దహనం
- భారీగా తరలివచ్చిన జనం

ఆదిలాబాద్: జిల్లా వ్యాప్తంగా దసరా వేడుకలను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. విజయదశమి పురస్కరించుకొని ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు బారులు తీరారు. సాయంత్రం జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు. జమ్మి ఆకులు (బంగారం) ఇచ్చిపుచ్చుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌కాలనీలో గల దసరా మైదానంలో హిందూ సమాజ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వేడుకలు కనులపండువగా సాగాయి. రావణ దహన ఘట్టాన్ని వీక్షించేందుకు జనం భారీగా తరలివచ్చారు. అలాగే జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి శోభాయాత్ర చేపట్టారు. అనంతరం దసరా మైదానంలో ఎమ్మెల్యే జోగు రామన్న ప్రత్యేక పూజలు చేసి రావణ దహన కార్యక్రమం ప్రారంభించారు. ప్రాంగణమంతా టపాసుల మోతతో మార్మోగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ, నేటి యువత సనాతన ధర్మ పరిరక్షణకు ముందుకు రావాలన్నారు. తెలంగాణ ప్రాంత గోసంరక్షణ సమితి ప్రాంత అధికారి వెంకట్ నివాస్ మాట్లాడుతూ మనిషి జీవితంలో ఆధ్యాత్మికత, సంస్కృతి, కుటుంబ జీవనం ఎంతో ముఖ్యమైన అంశాలన్నారు. అనంతరం వినాయక చవితి ఉత్సవాల్లో వైవిధ్యంగా, ఘనంగా వేడుకలు నిర్వహించిన మంటపాల నిర్వాహకులకు జ్ఞాపికలు అందజేశారు.

**సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో**

జిల్లా కేంద్రంలోని రామ్ లీలా మైదానంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి, డీసీసీబీ చైర్మన్ భోజా రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించి రావణ దహన కార్యక్రమాన్ని చేపట్టారు. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, కౌన్సిలర్ భరత్, హిందూ సమాజ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు హనుమాండ్లు, లెనిన్, ప్రముఖ వ్యాపారవేత్త భజరంగ్‌లాల్ అగర్వాల్, సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మన్ రవికిరణ్ యాదవ్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, సనాతన హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రఫుల్ వజె, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# హస్తం.. ఆలస్యం!

- ఇప్పటికే క్షేత్రస్థాయిలోకి బీఆర్ఎస్
- ప్రచారం షురూ చేసిన బీజేపీ
- 'కాంగ్రెస్' రెండో జాబితాపై ఉత్కంఠ
- దసరా ప్రత్యేక పూజలతో నేతల సందడి

సాక్షి,ఆదిలాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రోజురోజుకు రాజకీయం వేడెక్కుతుంది. దసరా ప్రత్యేక పూజల తర్వాత ఎన్నికల రణరంగంలో నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధం అవుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థుల ఎంపిక జరిగిపోగా, బీజేపీకి సంబంధించి ఆసిఫాబాద్ మినహా మిగితా నియోజకవర్గాల్లో క్యాండెట్ ఎవరనేది స్పష్టమైపోయింది. కాంగ్రెస్ నుంచి ఎవరు బరిలో ఉంటారనేది తేలాల్సి ఉంది. ఆ పార్టీకి సంబంధించి రెండో జాబితా నేడో.. రేపో రానుండడంతో ఉత్కంఠ నెలకొంది.

**బీజేపీ నుంచి..**

బీజేపీ నుంచి ఎడతెగని ఉత్కంఠ తర్వాత తొలి జాబితాలోనే ఆసిఫాబాద్ మినహాయిస్తే మిగతా నియోజకవర్గాలకు అభ్యర్థులు ఖరారయ్యారు. ఆదిలాబాద్ నుంచి పాయల్ శంకర్ మరోసారి బరిలోకి దిగారు. బోథ్ టికెట్‌ను ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావుకు కేటాయించింది. ఖానాపూర్ నుంచి మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌ను బరిలోకి దించింది. ఇక ఆసిఫాబాద్‌లో అభ్యర్థి తేలాల్సి ఉంది. మలి జాబితాలో ఇక్కడి నుంచి ఎవరు బరిలో నిలుస్తారనేది తెలుస్తుంది.

**పాత కాపులే..**

ఆదిలాబాద్‌లో బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు ఇదివరకటి నుంచి ప్రత్యర్థులే. 2014, 2018 ఎన్నికల్లో ఆయా పార్టీల నుంచి వీరే అభ్యర్థులుగా ఉన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న జోగు రామన్న 2012లో ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ నుంచి ఉప ఎన్నికల బరిలో నిలిచారు. అప్పుడు టీడీపీ నుంచి పాయల్ శంకర్ బరిలోకి దిగారు. ఆ వరుస ఎన్నికల్లోనూ జోగు రామన్నదే పైచేయి అయింది. బోథ్‌లో 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సోయం బాపూరావు పోటీ చేశారు. అప్పుడు కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ అనిల్ జాదవ్ స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో పార్టీలు మారినప్పటికీ వారిద్దరి పార్టీ, జెండా మారినప్పటికీ సమీప ప్రత్యర్థులుగా రంగంలో నిలిచారు. ఖానాపూర్‌లో గత ఎన్నికల్లో రాథోడ్ రమేశ్ కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన రేఖానాయక్ గెలుపొందారు. ఈసారి బీఆర్ఎస్ నుంచి భుక్యా జాన్సన్ నాయక్ బరిలో నిలవగా, బీజేపీ నుంచి రాథోడ్ రమేశ్ ఉన్నారు. ఇక ఆసిఫాబాద్‌లో బీజేపీ అభ్యర్థికి సంబంధించి మలి జాబితాలో పేరు విడుదల కానుంది.

**నేడో రేపో కాంగ్రెస్ జాబితా..**

కాంగ్రెస్ తొలి జాబితాలో ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లోని నిర్మల్ అభ్యర్థిగా శ్రీహరి రావు మినహాయిస్తే ఎవరికి చోటు దక్కలేదు. రెండో జాబితాపై ఎడతెగని ఉత్కంఠ కొనసాగుతుంది. బుధ,గురువారాల్లో ఈ జాబితా విడుదలయ్యే అవకాశం ఉందని పార్టీలో చర్చ సాగుతుంది. ప్రస్తుతం కంది శ్రీనివాసరెడ్డి పేరు తెరపైకి వస్తుండగా, బీసీ కోటాలో గండ్రత్ సుజాత, మైనార్టీ కోటాలో సాజిద్‌ఖాన్‌కు ఛాన్స్ దక్కుతుందని వేచి చూస్తున్నారు. కంది శ్రీనివాసరెడ్డి ఇప్పటికే ప్రచార రథాలను సిద్ధం చేసుకొని రంగంలోకి దిగారు. బోథ్‌లో ఈ పార్టీ నుంచి ఏకంగా 18 మంది, ఖానాపూర్ నుంచి 15 మంది, ఆసిఫాబాద్ నుంచి 10 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో టికెట్ ఎవరికి దక్కుతుందనేది ఆసక్తికరం. ఇటీవలే ఆ పార్టీలో చేరిన ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు బోథ్ నుంచి ప్రయత్నాలు చేస్తున్నారు.

**బీఆర్ఎస్ నుంచి..**

బీఆర్ఎస్‌కు సంబంధించి రెండు నెలల క్రితమే పార్టీ అభ్యర్థులు ఖరారైపోయారు. ఆదిలాబాద్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే జోగు రామన్న పైనే భరోసా ఉంచి పార్టీ అధిష్టానం మరోసారి రంగంలో నిలిపింది. బోథ్, ఖానాపూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపూరావు, రేఖానాయక్‌లను తప్పించడం కలకలం కలిగించింది. ఇటీవలే వారిద్దరు కాంగ్రెస్‌లో చేరారు. వారి స్థానంలో బోథ్‌కు నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఖానాపూర్‌లో కొత్త ముఖం భుక్యా జాన్సన్ నాయక్‌ను బరిలో నిలిచారు. ఇక ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు కాకుండా ఆసిఫాబాద్ జెడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మిని పార్టీ అధిష్టానం మరోసారి బరిలోకి నిలిపింది. గత ఎన్నికల్లోనూ కోవ లక్ష్మి బీఆర్ఎస్ అభ్యర్థిగానే పోటీ చేశారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఆత్రం సక్కు చేతిలో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత కాలంలో సక్కు బీఆర్ఎస్‌లో చేరారు. భవిష్యత్తు హామీ ఇవ్వడంతో ఆయన లక్ష్మి గెలుపు కోసం పనిచేస్తూ పార్టీలోనే కొనసాగుతున్నారు.

## అందరూ విజయం సాధించాలి

- ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి



ఆయుధపూజలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలంతా సుఖసంతోషాలతో ఉంటూ అన్నింటిలో విజయం సాధించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. విజయదశమి సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో సోమవారం ఆయుధ పూజ నిర్వహించారు. వేదపండితుడు చికిలి వెంకటేశ్వరశాస్త్రి ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. అనంతరం విజయానికి చిహ్నంగా ఆకాశం వైపు ఐదు రౌండ్ల కాల్పులు జరిపారు. సాయుధ పోలీసు విభాగంలో పనిచేస్తున్న డాగ్‌స్క్వాడ్, బాంబ్‌స్క్వాడ్, పోలీసు వాహనాలకు పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో ఆయుధాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో వర్టికల్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ ప్రణయ్‌కుమార్, రిజర్వు సీఐలు నవీన్, మురళి, స్వామి, రాకేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఫ్లాగ్‌మార్చ్‌లో బీఎస్ఎఫ్ బలగాలు, పోలీసులతో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

- ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి
- జిల్లాకేంద్రంలో ఫ్లాగ్ మార్చ్

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలు ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో 400 మంది బీఎస్ఎఫ్ బలగాలు, జిల్లా పోలీసు సిబ్బందితో మంగళవారం భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కలెక్టరేట్ చౌక్ నుంచి ప్రారంభమై పట్టణంలోని ప్రధాన కూడళ్ల మీదుగా సాగి బస్టాండ్ వద్ద ముగిసింది. రెండు కంపెనీల బీఎస్ఎఫ్‌తో పాటు ఆదిలాబాద్ పట్టణంలోని రిజర్వ్ సిబ్బంది, స్పెషల్ పార్టీ, క్యూఆర్టీ, హోంగార్డ్‌లు పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సంజయ్, ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్, పట్టణ సీఐలు, ఎస్సైలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ సిబ్బంది, ట్రాఫిక్, స్పెషల్ పార్టీ, క్యూఆర్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# దిగుబడి రాకపాయె.. ధర లేకపాయె

- పత్తి గిట్టుబాటు ధర కోసం అన్నదాత ఎదురుచూపు
- మద్దతు ధర క్వింటాలుకు రూ.7,020
- ఈ నెల 30 నుంచి పత్తి కొనుగోళ్లు
- రంగంలోకి సీసీఐ
- ఆధార్ అథెంటిఫికేషన్ తప్పనిసరి
- తప్పని తేమ కొర్రీ

| |
|---|
| జిల్లాలో ఈ ఏడాది సాగుచేసిన పత్తి 3 లక్షల 50 వేల ఎకరాలు |
| గతేడాది ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసిన పత్తి: 10 లక్షల 51వేల క్వింటాళ్లు |
| గతేడాది సీసీఐ కొనుగోలు చేసింది: నిల్ |
| ఈ ఏడాది పత్తి దిగుబడి అంచనా 28 లక్షల క్వింటాళ్లు |
| పత్తి మద్దతు ధర క్వింటాలుకు: రూ.7,020 |
| బహిరంగ మార్కెట్ ధర : రూ.6,400-రూ.6,800 వరకు |
| జిల్లాలో మార్కెట్ యార్డులు : 05 |



పత్తి పంట (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: ఆరుగాలం కష్టపడి రైతన్నలు పండించిన పంటలకు మద్దతు ధర లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఒకయేడు అతివృష్టి, మరోయేడు అనావృష్టి, పంటలు బాగా పండితే మద్దతు ధర లేకపోవడం, దిగుబడులు లేని సమయంలో ధరలు పెరగడం.. ఇలా అనేక సమస్యలతో అన్నదాతలు సతమతం అవుతున్నారు. కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితుల్లో అవస్థలు పడుతున్నారు. ఏదో రూపంలో ఇలా కర్షకులు నష్టాలను చవిచూస్తున్నారు. ప్రకృతివైపరీత్యం, దళారుల మోసం.. వెరసి అప్పుల పాలవుతున్నారే తప్పా గట్టెక్కలేకపోతున్నారు. గతేడాది మొదట్లో బహిరంగ మార్కెట్లో పత్తి ధర క్వింటాలుకు రూ.8 వేల నుంచి రూ.9వేల వరకు పలికింది. ఆ తర్వాత ప్రైవేట్ వ్యాపారులు కుమ్మక్కై రూ.7,600 వరకు చెల్లించారు. ధర పెరుగుతుందని రైతులు తమ ఇళ్లలో పత్తి నిల్వ ఉంచుకున్నప్పటికీ గత్యంతరం లేక చివరికి తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ ఏడాది అతివృష్టితో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆశించిన మేరకు దిగుబడి వచ్చే పరిస్థితి లేక పోగా కనీసం పెట్టుబడి సైతం రాని పరిస్థితి. బహిరంగ మార్కెట్లో ధర తక్కువగా ఉండడంతో సీసీఐకే అమ్ముకోవాల్సిన పరిస్థితి. ఈ నెల 30 నుంచి పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.

**రంగంలోకి సీసీఐ..**

ఈ ఏడాది బహిరంగ మార్కెట్లో పత్తికి మద్దతు కంటే తక్కువగా ధర పలుకుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బేల్ ధర ప్రస్తుతం రూ.58,180 ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. సెప్టెంబర్‌లో రూ.61వేలు ఉండగా రూ.3 వేలు తగ్గింది. ప్రభుత్వరంగ సంస్థ అయిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మద్దతు ధర కంటే తక్కువగా ఉంటే కొనుగోలు చేసేందుకు ముందుకొస్తుంది. గతేడాది క్వింటాలు పత్తి కూడా కొనుగోలు చేయలేదు. కానీ ఈ ఏడాది కొనుగోలు చేసేందుకు రంగంలోకి దిగనుంది. క్వింటాలుకు మద్దతు ధర రూ.7,020 ఉంది. గతేడాది మద్దతు ధర రూ.6,380 ఉండగా ప్రైవేట్ వ్యాపారులు ఒకడుగు ముందుకేసి రూ.8వేల నుంచి రూ.9వేల వరకు కొనుగోలు చేశారు. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకే విక్రయించారు. ఈ ఏడాది మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది.

**ధర లేక దిగాలు..**

ఈ ఏడాది అంతర్జాతీయ మార్కెట్లో పత్తికి కొంత డిమాండ్ తగ్గింది. దీనిప్రభావం రాష్ట్రంలోని ఆయా మార్కెట్లలో కనిపిస్తోంది. ఆయా మార్కెట్లలో క్వింటాలు పత్తికి రూ.6,400 నుంచి రూ.6,800 వరకు ధర పలుకుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది కురిసిన వర్షాలకు పత్తి పంట పూత, కాత రాలింది. ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా 5 నుంచి 8 క్వింటాళ్ల వరకు మాత్రమే వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. క్వింటాలుకు రూ.9వేల వరకు ధర చెల్లిస్తే గానీ గిట్టుబాటు కాదని రైతులు పేర్కొంటున్నారు.

**తేమ పేరిట తిప్పలు..**

ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏటా తేమ కొర్రి పేరిట రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఈ సారి వర్షాలు కురియడం, శీతాకాలం ప్రారంభంతో మంచు కురుస్తుండడంతో పత్తిలో తేమ శాతం పెరుగుతోంది. అయితే సీసీఐ నిబంధనల ప్రకారం 8 నుంచి 12 తేమ శాతం ఉంటేనే కొనుగోలు చేస్తారు. ఆపై ఉంటే క్వింటాలుకు ఒక పాయింట్ చొప్పున ధరలో కోత విధిస్తారు. ఈసారి ప్రైవేట్ వ్యాపారులు రంగంలో లేకపోవడంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉంది.

**ఆధార్ అథెంటిఫికేషన్ తప్పనిసరి..**

ఈ ఏడాది సీసీఐ పత్తి విక్రయించే రైతులకు బయోమెట్రిక్ తప్పనిసరి చేసింది. ఆధార్ అథెంటిఫికేషన్‌తోనే కొనుగోళ్లు జరుగనుండడంతో దళారులకు చెక్ పడనుంది. రైతులు తమ పట్టాపాస్‌బుక్‌లకు అనుసంధానం చేసిన ఆధార్‌తో వారి ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి. రైతులకు ఎన్ని ఎకరాల భూమి ఉంది. ఎంత దిగుబడి వస్తుందనే వివరాలు తెలియనున్నాయి. రైతులు మార్కెట్‌కు వచ్చి ఆధార్, ఐరీస్, ఓటీపీ ద్వారానే పత్తిని కొనుగోలు చేయనున్నారు. రైతులు అందుబాటులో లేకపోతే వారి పత్తిని కొనుగోలు చేసే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు.ప్రతిరైతు పట్టాపాస్‌బుక్‌కు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచిస్తున్నారు.

**30 నుంచి కొనుగోళ్లు..**



ఈ నెల 30 నుంచి ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నాం. దీనికి సంబంధించి ఏర్పాటు పూర్తిచేశాం. ఇప్పటికే పత్తి తూకం కాంటాలను సిద్ధం చేశాం. క్వింటాలు పత్తికి మద్దతు ధర రూ.7,020 ఉంది. సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేపట్టే విధంగా చర్యలు చేపడుతున్నాం. పత్తిని ఆరబెట్టి తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుంది.

– శ్రీనివాస్, మార్కెటింగ్ ఏడీ, ఆదిలాబాద్

# మళ్లీ పులి సంచారం

- పిప్పల్‌కోటి శివారులో ఆవుదూడపై దాడి
- భయాందోళనలో భీంపూర్ మండలవాసులు

తాంసి: మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి వచ్చిన పులి సంచారంతో భీంపూర్ మండల వాసులు భయాందోళనకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం తెలంగాణ సరిహద్దున ఉన్న మహారాష్ట్రలో గల చిన్నార్లి గ్రామ సమీపంలో పులి రోడ్డుపై సంచరిస్తూ కనిపించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం భీంపూర్ మండలం పిప్పల్‌కోటి శివారులో మేతకు వెళ్లిన ఆవుదూడపై పులి దాడి చేసి హతమార్చింది. ఈ ఘటనతో శివారు ప్రాంతంలో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే.. పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన పశువుల కాపరి పొచ్చన్న మంగళవారం ఉదయం పశువులను మేత కోసం చేల వైపు తీసుకెళ్లాడు. మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా పులి దాడి చేసి గోపాల్ అనే రైతు ఆవు దూడను తీవ్రంగా గాయపరిచింది. గమనించిన కాపరి కేకలు వేయడంతో పులి దానిని అక్కడే వదిలేసి అటవీ ప్రాంతంలోకి వెళ్లింది. తర్వాత ఆవు దూడ చనిపోయింది. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న ఫారెస్ట్ సెక్షన్ అధికారి హైమద్ ఖాన్ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. పరిసరాలు పరిశీలించి వివరాలు సేకరించారు. పులి సంచారం కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట బీట్ ఆఫీసర్ సాయి కుమార్, ఎనిమల్ ట్రాకర్స్ కృష్ణ, సోనేరావు ఉన్నారు.



పులిదాడిలో గాయపడి చనిపోయిన ఆవుదూడ

**భయాందోళనలో రైతులు**

ప్రస్తుతం పత్తిపంట చేతికొచ్చే సమయంలో పులి సంచరిస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేలకు వెళ్లేందుకు జంకుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి పులుల బారి నుంచి తమను కాపాడాలని కోరుతున్నారు.

## క్లుప్తంగా

### విద్యుత్ షాక్‌తో గేదె మృతి

కడెం: మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామానికి చెందిన నునవత్ శంకర్‌కు చెందిన గేదె మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. గోదావరి ఒడ్డుకు మేతకు వెళ్లిన గేదెకు ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.90వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

### షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


కాలిన సామగ్రిని చూపుతున్న బాధితులు

కడెం: మండలంలోని ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన కనక మాన్కు ఇల్లు ఈ నెల 22వ తేదీ రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. ఇంట్లోని వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో సుమారు రెండు లక్షల నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని మాన్కు కుటుంబ సభ్యులు వేడుకున్నారు.

### ఉరివేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

కుభీర్: ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని పల్సి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ఎండీ షరీఫ్ వివరాల ప్రకారం... బోయిన సాయన్న(67) సోమవారం సాయంత్రం చేనుకు పోతానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఉదయం అతడి కుమారుడు చేనుకు వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. సోయా పంట దిగుబడి సరిగా రాకపోవడంతో మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయన్న భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

### 45 మద్యం సీసాల పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని టూటౌన్ ఎస్సై ప్రదీప్ కుమార్ మంగళవారం పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గుడిహత్నూర్ మండలంలోని మల్కాపూర్‌కు చెందిన బాస భగవాన్ బస్టాండ్ సమీపంలో వైన్స్‌షాప్ నుంచి 15 చీప్ లిక్కర్లు, 15 ఓసీ క్వార్టర్లు, 10 ఎంసీ క్వార్టర్లు, 5 ఐబీ క్వార్టర్లను తీసుకెళ్తున్నాడు. ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పట్టుబడ్డ మద్యం విలువ రూ.6300 ఉంటుందని పేర్కొన్నారు.

### గుడుంబా విక్రేత అరెస్టు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ అంబేద్కర్ చౌరస్తా వద్ద అమ్మకానికి తీసుకువెళ్తున్న గుడుంబాను పట్టుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. మంగళవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అంబేద్కర్ చౌరస్తా వద్ద కాసిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన శ్రీరాముల సమ్మయ్య అనే వ్యక్తి ప్లాస్టిక్ క్యాన్‌లలో నింపుకుని విక్రయానికి తీసుకెళ్తుండగా రెండు లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

**బెల్ట్‌షాప్‌లో మద్యం పట్టివేత..**
బెల్లంపల్లి మున్సిపాలిటీ హన్మాన్ బస్తీలోని ఓ బెల్ట్ షాపులో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు.



# యంత్రంతో ప్రజాతంత్రం...

- ఎన్నికల్లో ఓటింగ్ మిషన్ల ప్రాధాన్యత
- పకడ్బందీగా, పారదర్శకంగా..
- సాంకేతికత వినియోగంలో ఈవీఎం, వీవీప్యాట్లు



ఈవీఎం యంత్రం


నిర్మల్ జిల్లా కేంద్రంలో పోలింగ్ విధానంపై కొనసాగుతున్న శిక్షణ

నిర్మల్‌ఖిల్లా: ఎన్నికల పోలింగ్ అనగానే ఒకప్పుడు బ్యాలెట్ బాక్సులు, పేపర్లు గుర్తొచ్చేవి. ఒక్కొక్క ఓటుకు ఒక్కొక్క బ్యాలెట్ పేపర్‌పై స్వస్తిక్ ముద్రను వేసి ఓటు హక్కును వినియోగించుకునేవారు. కాలక్రమేణా పోలింగ్ ప్రక్రియలో మార్పు వచ్చింది. బ్యాలెట్ పేపర్, బ్యాలెట్ బాక్స్ స్థానంలో ఈవీఎంలు, వీవీ ప్లాట్లు వచ్చేశాయి. గతంలో బ్యాలెట్ పేపర్‌తో ఓటింగ్ ముగిసిన వెంటనే వాటిని భద్రపరిచి కౌంటింగ్ కేంద్రానికి తరలించేవారు. అక్కడ ఒక్కొక్క బ్యాలెట్ పేపర్‌ను వేరు చేస్తూ కట్టలు కట్టేవారు. బ్యాలెట్ బాక్సుల్లో ఏ పార్టీకి ఎన్ని కట్టలు వచ్చాయనని లెక్కించేవారు. ఫలితాల కోసం కూడా సుదీర్ఘంగా నిరీక్షించాల్సి వచ్చేది. ఓటింగ్ వ్యవస్థలో సాంకేతికత వచ్చేసింది. ఎన్నికల్లో పారదర్శకతను పెంచి, ప్రక్రియ సరళతరం చేసేందుకు ఓటింగ్ మిషన్లు అత్యంత గణనీయంగా ఉపయోగపడుతున్నాయి.

**ఈవీఎం నేపథ్యం...**
ఈవీఎం యంత్రం ప్రధానంగా మూడు భాగాలుగా ఉంటుంది.
బీయూ (బ్యాలెట్ యూనిట్)
సీయూ (కంట్రోల్ యూనిట్)
వీవీప్యాట్.. (ఓటర్ వెరిఫైబుల్ పేపర్ అండ్ ట్రయల్)

భారత ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో 1980లో ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ హైదరాబాద్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ బెంగళూరు వారు సంయుక్తంగా ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)ను తయారు చేశారు. వీటిని మొట్టమొదటిసారిగా 1982లో కేరళ రాష్ట్రంలోని పారోవర్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో 50 పోలింగ్ కేంద్రాల్లో ఉపయోగించారు. 2004లో తొలిసారిగా దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో లోక్‌సభ ఎన్నికల్లో ఈవీఎంలను వినియోగించారు.

**వీవీ ప్యాట్..**
ఈవీఎం ద్వారా ఓటరు తాను వేసిన ఓటును నిర్ధారించడానికి వీవీ ప్లాట్ ఉపయోగపడుతుంది. ఓటు వేయగానే వీవీప్యాట్‌లో ఆ అభ్యర్థి వేసిన ఓటుగుర్తును స్లిప్‌లో ముద్రించి ఇస్తుంది. దాదాపు ఏడు క్షణాల పాటు ఆ స్లిప్పు ఓటరుకు కనిపిస్తుంది. అనంతరం దానంతట అదే వీవీప్యాట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లో పడిపోతుంది. తెలంగాణలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వీటిని తొలిసారిగా ఉపయోగించారు.

**విద్యుత్ అంతరాయం కలిగితే ఎలా..**
ఈవీఎం యంత్రాలు బ్యాటరీల ఆధారంగా పనిచేసేలా రూపొందించారు. మొదటితరం ఎం–2 ఈవీఎం యంత్రాల్లో 6 వోల్టుల సామర్థ్యంతో కూడిన ఆల్కలైన్ పవర్ బ్యాటరీలను ఉపయోగిస్తే, ప్రస్తుత ఎం–3 యంత్రాలలో 7.5 వోల్టుల విద్యుత్ సామర్థ్యంతో కూడిన ఆల్కలైన్ పవర్ బ్యాటరీలను ఉపయోగించడంతో ఎక్కువసేపు ఇవి పనిచేసేందుకు వీలుంటుంది. ప్రస్తుత ఆధునాతన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్(ఈవీఎమ్)లు గరిష్ఠంగా 3,840 ఓట్లను నమోదు చేస్తాయి. ఒక పోలింగ్ కేంద్రంలో సాధారణంగా మొత్తం ఓటర్ల సంఖ్య 1500కు మించదు.

**సీయూ( కంట్రోల్ యూనిట్)**
కంట్రోల్ యూనిట్ అనేది పూర్తిగా పోలింగ్ అధికారుల అధీనంలో ఉండే యంత్రం. పోలింగ్ సమయంలో బ్యాలెట్ యూనిట్‌లో వేసిన ఓటు కేబుల్ ద్వారా ప్రయాణించి అధికారి అధీనంలో ఉండే కంట్రోల్ యూనిట్లో నిక్షిప్తమై ఉంటుంది. పోలింగ్ పూర్తయిన అనంతరం వాటిని సీల్ చేసి లెక్కింపు కేంద్రాలకు తరలిస్తారు. కౌంటింగ్ సమయంలో సీయూలోని సమాచారం ఆధారంగానే లెక్కిస్తారు. కంట్రోల్ యూనిట్‌లో నిక్షిప్తమైన సమాచారం దాదాపు 15ఏళ్ల వరకు భద్రంగా ఉంటుంది.

**బీయూ (బ్యాలెట్ యూనిట్)..**
అభ్యర్థుల పేర్లు, గుర్తులు, ఫొటోలను వరుసగా బ్యాలెట్ యూనిట్‌పై ముద్రిస్తారు. ఒక బ్యాలెట్ యూనిట్‌పై 16 మంది అభ్యర్థులను సూచించే అవకాశం ఉంది. ఎక్కువమంది అభ్యర్థులు బరిలో ఉంటే మరో బ్యాలెట్ అనుసంధానం చేస్తారు. 2006–10 మధ్యకాలంలో తయారు చేసిన ఎం–2 ఈవీఎం యంత్రాలకు 4 బ్యాలెట్ యూనిట్లను అనుసంధానం చేసే విధంగా రూపొందించారు. దాదాపు 64మంది అభ్యర్థులు ఏకకాలంలో పోటీ చేస్తున్న సూచించేందుకు వీలు ఉండేది. ప్రస్తుతం ఆధునాతన ఎం–3 ఈవీఎం యంత్రాలకు 24బ్యాలెట్ యూనిట్లను అంటే మొత్తం 384 మంది అభ్యర్థుల సమాచారం సూచించేందుకు అవకాశం ఉంది.

### పారదర్శకంగా ఉంటుంది



ఈవీఎం యంత్రాల ద్వారా ఓటును వినియోగించుకోవడం అనేది అత్యంత పారదర్శకంగా ఉంటుంది. ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా, సరళతరంగా చేపట్టడానికి ఈవీఎం యంత్రాలు అత్యంత ప్రయోజనకరంగా ఉంటాయి. నిర్మల్ జిల్లాలో దాదాపు 4వేల మంది ఎన్నికల సిబ్బందికి ఈవీఎం యంత్రాల పనితీరుపై కలెక్టర్, రిటర్నింగ్ అధికారుల మార్గదర్శనంలో శిక్షణ కొనసాగుతోంది. – మైస అరవింద్ కుమార్, ఎన్నికల శిక్షణ మాస్టర్, నిర్మల్

**అంధులకు సైతం అందుబాటులో..**
ఈవీఎం ఓటింగ్ యంత్రాల ద్వారా అంధులు కూడా సరళంగా ఓటు వేసే విధంగా ఎన్నికల కమిషన్ ఈ ప్రత్యేక యంత్రాన్ని రూపొందించింది. బ్యాలెట్ యూనిట్ పై బ్రెయిలీ లిపితో కూడా క్రమ సంఖ్యలను ఏర్పాటు చేసింది.

### రూ. 2లక్షలు సీజ్


సీజ్ చేసిన నగదుతో పోలీసులు

జైనథ్: మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద రూ. 2లక్షల నగదును పోలీసులు సీజ్ చేసినట్లు టూ టౌన్ ఎస్సై నారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సూర్యభాన్ తన కారులో గుర్గావ్‌కు చెందిన తమిళనాడుకు వెళ్తున్నాడు. చెక్‌పోస్ట్ వద్ద కారును తనిఖీ చేయగా రూ.2లక్షల నగదు లభించింది. కాగా నగదుకు సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

**కారు, మద్యం సీజ్..**
పిప్పర్‌వాడ చెక్‌పోస్ట్ వద్ద కారులో మద్యంతో వెళ్తున్న బీహార్‌కు చెందిన వినోద్ కుమార్ వద్ద నుంచి ఎక్సైజ్ పోలీసులు మూడు మధ్యప్రదేశ్‌కు చెందిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర వైపు నుంచి తెలంగాణలోకి వస్తుండగా పిప్పర్‌వాడ చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టగా మద్యం లభించినట్లు తెలిపారు.కేసు నమోదు చేసి, మద్యంతో పాటు కారును సైతం సీజ్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్, ఎస్సై రమాదేవి తెలిపారు.

### ఆరు డీజేలు సీజ్..

నిర్మల్‌టౌన్: పట్టణంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండగా రాత్రి 10గంటల తర్వాత డీజేలు పెట్టి శబ్ద కాలుష్యం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘించిన ఆరు డీజేలను సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పురుషోత్తం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాత్రి 10గంటల తర్వాత విందులు వినోదాలకు, రాజకీయ పార్టీలకు సంబంధించిన డీజేలు, మైకులు పెట్టకూడదన్నారు. లేదంటే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పండుగ పూట విషాదం

- కారు ఢీకొని బాలుడి మృతి

నేరడిగొండ: మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44పై మంగళవారం పండుగ పూట విషాదం చోటుచేసుకుంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన నాగబోతుల సత్తవ్వ తన కుమారుడు రమేశ్ (13)తో కలిసి కుటుంబ సభ్యులు నేరడిగొండ మండల కేంద్రంలో భిక్షాటన చేస్తున్నారు. రోడ్డు దాటుతుండగా ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న కారు బాలుడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని బోథ్ ఏరియా ఆస్పత్రికి పంచనామా నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


బాలుడి మృతదేహం

**అంత్యక్రియలకు చైతన్యయూత్ సాయం**

బోథ్: నేరడిగొండ మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదంలో రమేశ్ (11) మృతిచెందగా అంత్యక్రియలకు మండల కేంద్రానికి చెందిన చైతన్య యూత్ సభ్యులు రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. అనిల్ అనే వ్యక్తి సమాచారం ఇవ్వడంతో చైతన్య యూత్ సభ్యులు కోల శ్రీకాంత్, కత్తూరి ప్రవీణ్, లాడి భూషణ్‌లు సాయం అందించారు. మృతదేహాన్ని ఆదిలాబాద్ తరలించడానికి వాహనాన్ని ఏర్పాటు చేసి మానవత్వాన్ని చాటుకుటున్నారు.


సహాయం అందిస్తున్న చైతన్య యూత్ సభ్యులు

# కార్యకర్తలకు అండగా ఉంటా

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్‌రావు పటేల్


మాట్లాడుతున్న మోహన్‌రావుపటేల్

భైంసాటౌన్: బీజేపీ అభ్యర్థుల జాబితా ప్రకటించిన నేపథ్యంలో తాను పార్టీలోనే కొనసాగుతానని, తన వెంట నడిచిన కార్యకర్తలకు అండగా ఉంటానని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్‌రావుపటేల్ అన్నారు. పట్టణంలోని దారాబ్జి ఫ్యాక్టరీలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముధోల్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో బీజేపీలో చేరానన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు పల్లెపల్లెకు బీజేపీ– గడపగడపకూ మోహన్‌రావు పేరిట 190 గ్రామాలను సందర్శించి పార్టీ జెండా ఆవిష్కరించి దాదాపు 40వేల కుటుంబాలను ప్రత్యక్షంగా కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించినట్లు తెలిపాడు. ఈ సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, గాలి రవి, తదితరులు ఉన్నారు.

# బాసరలో ముగిసిన ఉత్సవాలు


అశ్వరథంపై ఊరేగుతున్న సరస్వతీ అమ్మవారు

భైంసా(ముధోల్): బాసరలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. తొమ్మిది రోజులు తొమ్మిది రూపాల్లో సరస్వతీ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం సరస్వతీ అమ్మవారిని అశ్వరథంపై ఊరేగించారు. తొమ్మిది రోజులపాటు బాసర ఆలయంలో సీఐ వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. అమ్మవారి దీక్షలు స్వీకరించిన భక్తులు సోమవారం ఉపవాస దీక్షలు పూర్తి చేసుకున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో నిత్యాన్నదానం చేసిన నాందేడ్‌కు చెందిన జగదీశ్ మహారాజ్ గాడిపుర బృందాన్ని సత్కరించారు.

**అభిషేకం లడ్డూకు ఫంగస్**
నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వచ్చే భక్తులకోసం తయారు చేయించిన అభిషేకం లడ్డూలు సరైన చోట నిల్వ ఉంచకపోవడంతో ఫంగస్ ఏర్పడింది. గుర్తించిన ఆలయ సిబ్బంది కొన్నింటిని బయట పారవేశారు. ప్రసాద లడ్డూల నిల్వల విషయంలో అధికారులు నిర్లక్ష్యంచేస్తున్నారంటూ కొంత మంది భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**నిమజ్జనంపై ప్రత్యేక నజర్**
భైంసా పట్టణంలో బుధవారం నిర్వహించనున్న దుర్గామాత నిమజ్జనోత్సవం సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. భవానీచౌక్‌లో ప్రతిష్ఠించిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్ర ప్రారంభిస్తారు. ప్రధాన మార్గాల్లో పోలీస్ పికెటింగ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. శోభాయాత్ర దృశ్యాలను పోలీసులు ప్రత్యేకంగా చిత్రీకరించనున్నారు. శోభాయాత్ర మార్గాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

### కలప పట్టివేత


పట్టుబడిన కలపతో ఫారెస్టు అధికారులు

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి నుంచి టాటా ఏసీ ట్రాలీలో కలప తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఆ వాహనాన్ని పట్టుకోగా డ్రైవర్ పారిపోయినట్లు రేంజర్ రవి తెలిపారు. పట్టుబడిన 17 కలప దుంగలను కోటపల్లి రేంజ్‌కు తరలించారు. వాటి విలువ సుమారు రూ.75వేలు ఉంటుందని తెలిపారు. బీట్ ఆఫీసర్ నదీంమొద్దీన్, సత్యనారాయణ, బేస్‌క్యాంప్ సిబ్బంది చిరంజీవి, అశోక్, నవాజ్, సంపత్, సాగర్, శ్రీనివాస్ ఉన్నారు.

### లాల్‌టెకిడిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- పలువురిపై కేసు నమోదు

ఇంద్రవెల్లి: మండలంలోని హీరాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని లాల్‌టెకిడి గ్రామంలో సోమవారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నట్లు ఎస్సై డి.సునీల్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... దుర్గామాత ఆలయంలో భజన కార్యక్రమంలో భాగంగా మైక్‌సెట్ అడిగినందుకు గ్రామంలోని ఇరువర్గాల మధ్య గొడవ చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు మంగళవారం ఉదయం లాల్‌టెకిడి గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు. గ్రామానికి చెందిన రాథోడ్ వసంత్‌రావ్ ఫిర్యాదు మేరకు గ్రామ పెద్ద రాథోడ్ పర్శురాంనాయక్‌తో పాటు మొత్తం 18 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

### బాలికపై లైంగికదాడి

ఆదిలాబాద్‌రూరల్: బాలికపై అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ బాలికతో కిన్వాట్‌కు చెందిన అజయ్ అనే వ్యక్తికి పెళ్లి వేడుకలో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త స్నేహంగా మారింది. పెళ్లి చేసుకుంటానంటూ మాయమాటలు చెబుతూ ఆ బాలికను లొంగదీసుకునే ప్రయత్నం చేశాడు. అందులో భాగంగానే గత నెల సెప్టెంబర్‌లో ఆ బాలికను కిన్వాట్‌కు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె ఏడవడంతో అదే రోజు ఆ బాలికను ఇంటికి తీసుకొచ్చి వదిలేశాడు. ఈ విషయం బయటకు చెప్పవద్దంటూ బెదిరించాడు. తరచూ ఫోన్లో మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడుతూ వస్తున్నాడు. ఈ క్రమంలో దిగులుగాయ ఉంటున్న బాలికని తల్లి మందలించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో బాలిక తల్లి మావల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. నిందితుడిపై ఫోక్స్ చట్టం కింద కేసు కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై తెలిపాడు.

# శిశుమందిర్‌లో అపూర్వ సమ్మేళనం


శ్రీ సరస్వతి శిశు మందిర్ పూర్వ విద్యార్థులు

నిర్మల్‌చైన్‌గేట్: శ్రీ సరస్వతి శిశుమందిర్ నిర్మల్ పట్టణంలోని బుధవార్ పేట్‌లో 1997 నుంచి 1998 ఏడవ తరగతి చదువుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు 25 ఏళ్ల తరువాత అదే పాఠశాలలో మంగళవారం మళ్లీ కలుసుకున్నారు. 40మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా పాఠశాల పురాణ ప్రధానోపాధ్యాయులు మనోహర్‌వర్మ హాజరై జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించారు. అప్పటి మధుర జ్ఞాపకాలతో ఉల్లాసంగా గడిపారు. అప్పటి గురువులను సన్మానించారు.

**26 సంవత్సరాలు తర్వాత...**



26సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు గుర్తుపెట్టుకొని గురువులను సన్మానించడం సంతోషంగా ఉంది. శిశు మందిరాల్లో విద్యార్థులకు బోధించాను. ఉపాధ్యాయ వృత్తి నాకు సంతృప్తినిచ్చింది. మేము బోధించిన విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తే మాకు ఎంతో సంతోషం అనిపిస్తుంది.
– రాములు, ఉపాధ్యాయులు

**బాల్యస్నేహితులను కలుసుకున్నాను..**



నేను 1990 నుంచి 1998లో ఏడవ తరగతి వరకు బుధవార్‌పేట్ శిశు మందిర్‌లో చదువుకున్నాను. ఇన్నాళ్లకు బాల్యమిత్రులను కలుసుకునే అవకాశం వచ్చింది. చాలా సంతోషంగా మాట్లాడుకున్నాం. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నాం.
– ఎం శ్రావణి

**బాల్యంలోకి వెళ్లినట్టు అనిపించింది**



చిన్ననాటి మిత్రులందరినీ కలిసి ఈ రోజు ఇలా పాల్గొనడంతో తిరిగి బాల్యంలోకి వెళ్లినట్లు అనిపిస్తుంది. ఈ టైంలో బడి జ్ఞాపకాలను గుర్తుచేసి మనస్సుకు హాయి నింపడం ఆనందంగా ఉంది. అప్పటి మా గురువులను కలుసుకున్నాం.
– దుబ్బ ప్రవీణ్, పూర్వ విద్యార్థి

**మిత్రులకు అందుబాటులో ఉంటా**



చాలా రోజుల తర్వాత మిత్రులను కలిసిపోవడం చాలా ఆనందంగా ఉంది. జిల్లా కేంద్రంలో ఉంటాను.మిత్రులకు అందుబాటులో ఉంటా. చాలా రోజుల తర్వాత గురువులను సన్మానించుకోవడం సంతోషాన్ని ఇచ్చింది.
– మహేష్, పూర్వ విద్యార్థి

# బతుకమ్మలను చూసేందుకు వెళ్తూ..

- ఇద్దరు యువతుల మృత్యువాత
- ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్ని గుర్తు తెలియని కారు
- ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం


రాహిత్య(ఫైల్)


సాత్విక(ఫైల్)

జన్నారం: పండుగ సెలవులకు ఇంటికి వచ్చి బతుకమ్మ వేడుకలను తిలకించేందుకు స్కూటీపై వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృత్యువాతపడిన సంఘటన జన్నారం మండలం పొనకల్ గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులు, ఎస్సై సతీశ్ వివరాల ప్రకారం.. పిప్పర్ల గంగన్న సోమవారం రాత్రి 8గంటల ప్రాంతంలో తన కూతురు పిప్పర్ల రాహిత్య(15) తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని ప్రధాన రహదారి రేండ్లగూడ వైపు గల తన బంధువు బీట్ అధికారి తరాల్ల సాగర్, జ్యోత్స్న దంపతుల ఇంటికి వచ్చాడు. వారి కూతురు తరాల్ల సాత్విక(18) బైక్‌పై ఎక్కించుకుని ప్రధాన రహదారిపై వెళ్తున్నాడు. చెక్కపెల్లికుంట వద్ద ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అమ్మాయిలు బైక్‌పై నుంచి ఎగిరిపడ్డారు. గంగన్న బైక్ పక్కనే పడిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు తీవ్రగాయాలతో అపస్మారకస్థితిలో ఉన్న ముగ్గురిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అంతలోనే రాహిత్య మృతి చెందింది. గంగన్నకు తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాహిత్య పదో తరగతి చదువుతుండగా సాత్విక నీట్ కోచింగ్ తీసుకుంటుంది. రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. పుప్పర్ల గంగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


ఎస్సై తో మాట్లాడుతున్న రేఖానాయక్

**పలువురి పరామర్శ**
ఇద్దరు అమ్మాయిల మృతి విషయం తెలుసుకుని ఎమ్మెల్యే రేఖానాయక్ మంగళవారం ఇరు కుటుంబాలను పరామర్శించారు. తరాల్ల సాత్విక ఇంటికి వెళ్లి కుటుంబీకులను ఓదార్చారు. ఎమ్మెల్యేను చూసి రోదించిన సాత్విక తల్లి జ్యోత్స్నను చూసి ఎమ్మెల్యే కన్నీరు పెట్టుకున్నారు. అదే విధంగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఎమ్మెల్యే రేఖానాయక్ ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ఎస్సై సతీశ్‌ను ప్రశ్నించారు. అదే విధంగా బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థి జాన్సన్ నాయక్ మృతుల కుటుంబీకులను పరామర్శించారు. అటవీశాఖ సిబ్బంది, పలువురు నాయకులు, అధికారులు మృతుల కుటుంబీకులను పరామర్శించారు.

## క్లుప్తంగా

### రక్తదానం


రక్తదానం చేస్తున్న గాజరి రజినీకాంత్

ఆదిలాబాద్‌టౌన్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి రక్తదానం చేసి జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు గాజరి రజినీకాంత్ మంగళవారం ఉదారత చాటాడు. నిర్మల్ రూరల్ మండలానికి చెందిన రాజ్‌మహ్మద్ గుండె సంబంధిత వ్యాధితో నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గుండె సర్జరీ చేయాలని వైద్యులు సూచించారు. అరుదుగా లభించే బి-నెగటివ్ రక్తం అవసరమైంది. విషయం తెలుసుకున్న రజినీకాంత్.. నిజామాబాద్‌కు వెళ్లి రక్తదానం చేశాడు. ఆయనతోపాటు నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం చాకిర్యాల గ్రామానికి చెందిన రాజీవ్, మోర్తాడ్ మండలానికి చెందిన సాయికుమార్‌లు రక్తదానం చేసి మానవత్వాన్ని చాటారు. బాధిత కుటుంబీకులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

### మున్నూరుకాపు సంఘ అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: మున్నూరు కాపు సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణంలోని సంఘం భవనంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళన సభ సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో ఐటీ టవర్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. 2 వేల మంది ఉద్యోగాలు కల్పించేందుకు మార్గం సులువైందన్నారు. ఇంజినీరింగ్ కళాశాలతోపాటు నర్సింగ్ కాలేజ్ మంజూరు అయ్యాయని తెలిపారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాళ్ల విఠల్, కలాల శ్రీనివాస్, కులస్తులు జైపాల్, ప్రభ, జోగు రమణి, గంట స్వప్న, బొడగం మమత తదితరులు పాల్గొన్నారు.

### 'కేసీఆర్‌వి అన్ని మోసపూరిత మాటలు'


సభ్యులకు అందజేసిన కిట్లతో డాక్టర్ నరేంద్ర నాయక్

నేరడిగొండ: రాష్ట్రంలో రాక్షస పాలనను కొనసాగుతోందని ఖానాపూర్ నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నరేంద్ర నాయక్ అన్నారు. జనసేనలో సభ్యత్వం తీసుకున్న సభ్యులకు సోమవారం మండల కేంద్రంలో కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. నాయకులు చంద్రశేఖర్, వినేష్, శ్యామ్, అరుణ్, మణి, విక్రమ్, రాజు, పురుషోత్తం, సంతోష్, సునీల్, షేక్ అహ్మద్ పాల్గొన్నారు.

### ఆత్మీయ కలయిక



బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన మేధామిత్రులు గొల్లాపూర్ చెరువు వద్ద మంగళవారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. మిత్రులందరూ కలిసి వారి గుర్తులను నెమరువేసుకున్నారు. సమాజంలో కుటుంబ విలువలు తగ్గిపోతున్న దృష్ట్యా నేటి విద్యార్థులకు విలువలు గల పాఠాలు నేర్పించాలని తీర్మానం చేశారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత తీసుకోవాలన్నారు. మేధ మిత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

### అంత్యక్రియలకు ఆర్థికసాయం

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని శాస్త్రీనగర్ కాలనీకి చెందిన పండరి(38) అనారోగ్యంతో మృతిచెందాడు. భీం కంపెనీ సభ్యులు మంగళవారం అంత్యక్రియల నిమిత్తం బాధిత కుటుంబసభ్యులకు రూ.5 వేలు అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, కాగ్నే గను, ముండే సంతోష్, కేంద్రే బాలాజీ, ప్రవీణ్, నిలేష్, అవినాష్ ఉన్నారు.

# ఘనంగా దసరా వేడుకలు


కాంఘర్‌పూర్ శివారులో జమ్మి చెట్టు వద్ద రైతుల పూజలు

బేల: జిల్లా వ్యాప్తంగా (విజయదశమి) దసరా వేడుకలు ఆనందోత్సాహాల మధ్య సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పలు ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం జమ్మిచెట్టు పూజలు అనంతరం జమ్మి (బంగారం) ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాత్రి రావణాసుర దహనం నిర్వహించారు. బేల మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలు, భవానీగూడ(ఇ) గ్రామంలోని భవానీమాత ఆలయంలో అమ్మవారికి స్థానికులతోపాటు ఎకోరి, బేల, దహెగాం, డోప్టాల, షంషాబాద్, జూనోని, తదితర గ్రామాల ప్రజలు బంగారం(జొన్న ఆకులు), వెండి(జమ్మి ఆకు)లతో (జమ్మి)శమీ పూజలు చేశారు.

**ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి**

కైలాస్‌నగర్: ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, లక్ష్యసాధన దిశగా అడుగులు వేస్తున్న అందరికి విజయం చేకూరాలని కాంగ్రెస్ నేత కంది శ్రీనివాస్ ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని ప్రజాసేవా భవన్ క్యాంపు కార్యాలయంలో విజయదశమి వేడుకలు జరిగాయి. కంది శ్రీనివాస్‌రెడ్డి తన సతీమణి సాయిమౌన రెడ్డితో కలిసి శాస్త్రోక్తంగా ఆయుధ, వాహనపూజలు నిర్వహించారు. అనంతరం లోక కల్యాణార్థం ప్రజాసేవా భవన్‌లో నిర్వహించిన పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేదపండితుడు ప్రవీణ్ శర్మ నేతృత్వంలో పూజలు జరిగాయి. డీసీసీబీ మాజీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు సంతోష్‌రావు, డేరా కృష్ణారెడ్డి, షకీల్, రవి, శంకర్, మీరాబాయి, హరీశ్‌రెడ్డి, మహ్మద్, లింగన్న, సుభాష్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో ఆయుధాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వడూర్ గ్రామంలో అమ్మవారి పల్లకిని భక్తులు ఊరేగించారు. అనంతరం రావణుడి బొమ్మను దహనం చేశారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని కొన్ని గ్రామాల ప్రజలు సోమవారం దసరా జరుపుకుంటే మరి కొన్ని గ్రామాల్లో మంగళవారం వేడుకలను జరుపుకున్నారు. డప్పు, వాయిద్యాలతో గ్రామాల శివారు ప్రాంతాల్లోని జమ్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వాహనాలకు పూజలు నిర్వహించారు.


నేరడిగొండ: ఆయుధ పూజలో ఎస్సై సాయన్న దంపతులు, పోలీసులు

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో డప్పుచప్పుల మధ్య జమ్మి చెట్టు వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ఒకరికి ఒకరు అలాయ్ బలాయ్ చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


పూజలు నిర్వహిస్తున్న కంది శ్రీనివాస్ రెడ్డి దంపతులు

బోథ్: గ్రామాల్లో దుర్గామాత నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. మహిషాసుర దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దసరా సందర్భంగా ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సిరికొండ: మండల వ్యాప్తంగా మంగళవారం విజయదశమి పర్వదినాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. సిరికొండలో మహాలక్ష్మి ఆలయ ఆవరణలో జమ్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు.


వడూర్‌లో అమ్మవారి పల్లకి ఊరేగింపులో భక్తులు


అంతర్గాంలో జమ్మి చెట్టు వద్ద గ్రామస్తుల పూజలు

# సమాజసేవలో ముందుండాలి

- ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: సమాజసేవలో ముందుండాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. విజయదశమిని పురస్కరించుకొని సోమవారం దుర్గం ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన దుస్తుల పంపిణీ కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి హాజరయ్యారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. విస్తత సేవా కార్యక్రమాలు చేపడుతున్న దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్‌ను అభినందించారు. నాయకులు సాజిదొద్దీన్, శోభతాయి తుల్జాపురే, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు భీంరావు వాఘ్మరే, ప్రధాన కార్యదర్శి దాదాసాహెబ్ జబాడే, నాయకులు రాంకుమార్, జాడి రాజారెడ్డి, దుర్గం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

**నియోజకవర్గ అభివృద్ధికి కృషి**

ఆదిలాబాద్‌టౌన్: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణంలో ఎమ్మెల్యే సమక్షంలో పలువురు యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడ్డాక అన్నిరంగాల్లో ఆదిలాబాద్ అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో అభివృద్ధికే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.


ఎదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

# ఘనంగా దుర్గాదేవి శోభాయాత్ర


శోభాయాత్ర ప్రారంభించిన దృశ్యం


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఇచ్చోడ: మండల కేంద్రంలో మంగళవారం దుర్గాదేవి నిమజ్జన శోభాయాత్ర ఘనంగా కొనసాగుతుంది. సాయంత్రం మండపాల వద్ద పూజలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించారు. మండల కేంద్రంలో ప్రధాన వీధులగుండా సాగుతుంది. టీచర్స్‌కాలనీలో మహిళలు ప్రత్యేకంగా ఏకరూప దుస్తులు ధరించి నృత్యం చేశారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ చంద్రశేఖర్, ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజాము దుర్గాదేవిల నిమజ్జనం కానున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

**నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే**

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన అమ్మవారి నిమజ్జన శోభాయాత్రలో ఎమ్మెల్యే జోగు రామన్న పాల్గొన్నారు. పట్టణంలోని మహాలక్ష్మీవాడ, శాంతినగర్ కాలనీల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి నిమజ్జన శోభాయాత్ర కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు.

# వారికి ఓటేస్తే అభివృద్ధిలో వెనుకబడిపోతాం

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: జోగు రామన్న, పాయల శంకర్ ఇద్దరూ ఒక్కటేనని, వారిద్దరిలో ఎవరికీ ఓటేసినా అభివృద్ధిలో వెనుకబడిపోతుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. జిల్లాకేంద్రంలోని ప్రజాసేవా భవన్‌లో మంగళవారం పట్టణంలోని రాంనగర్ కాలనీవాసులతోపాటు ఆదిలాబాద్ రూరల్ మండలం పరిధిలోని రామాయి, జైనథ్ మండలం పెండల్‌వాడ గ్రామస్తులు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత ఆస్తులు కూడబెట్టుకోవడమే తప్ప ఈ 15 ఏళ్లలో జోగు రామన్న ప్రజలకు చేసిందేమీలేదని మండిపడ్డారు. ఆయనకు ఓటేసి కష్టాలు తెచ్చుకోవద్దని సూచించారు. ఇంత వరకు ఎంత మంది పేదలకు ఇంటి జాగాలు ఇచ్చారని, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇండ్లు కట్టించారో చెప్పాలని సవాల్ విసిరారు. ఇప్పటికీ చాలామంది అర్హులకు పింఛన్లు రావడంలేదని, కొత్త రేషన్ కార్డులు జారీ కావడంలేదన్నారు. కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మునిగెల విఠల్, నాయకులు సంతోష్‌రావు, సుజాత్ అలీ, షకీల్, కొండూరి రవి తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన మహిళలతో శ్రీనివాసరెడ్డి

### 'అభివృద్ధికే ప్రజల ఓటు'


ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓటు వేస్తారని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇజ్జగిరి నారాయణ అన్నారు. జిల్లాకేంద్రంలోని దుర్గానగర్‌లో మంగళవారం ఇంటింటా ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతోన్మాద బీజేపీ పార్టీని, అభివృద్ధి నిరోధక కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్నను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అజయ్, వినోద్, భగవాండ్లు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ధమ్మచక్ర పరివర్తన్ దివస్


ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, సర్పంచ్


పూలమాల వేస్తున్న సర్పంచ్, పీఏసీఎస్ చైర్మన్

నార్నూర్: మండలం కేంద్రంలో 64వ ధమ్మచక్ర పరివర్తన్ దివస్ మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చౌక్ నుంచి మార్కెట్ ఏరియా మీదుగా కుమురం భీం చౌక్ వరకు ప్రజలు, ప్రజాప్రతినిధులు భారీ ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ మాట్లాడారు. ప్రపంచ గొప్ప మేధావి డాక్టర్ అంబేద్కర్‌నని అన్నారు. భారత రాజ్యాంగాన్ని రచించిన మహా వ్యక్తి అని కొనియాడారు. శాంతి సమానత్వ సందేశాన్ని అందించిన బుద్ధుడి మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని అంబేద్కర్ బౌద్ధ ధర్మాన్ని స్వీకరించారని గుర్తు చేశారు. పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, ఎంపీటీసీ పరమేశ్వర్, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతరావు దుర్గే, అన్నాభావు సాఠె కమిటీ అధ్యక్షుడు కొర్రెళ్ల మహేందర్, మహిళా సంఘం నాయకురాలు దుర్గే రుక్మాబాయి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లోఖండే దేవురావు, నాయకుడు దుర్గె మహేందర్, శివాజీజాడే, శాంతరావు, ప్రకాశ్ చాలుర్కర్, రాణాప్రతాప్ ఉన్నారు.

ఇంద్రవెల్లి: మండలకేంద్రంతోపాటు ప్రబుద్ధనగర్, బుద్ధనగర్, భీంనగర్, సత్వాజీగూడ, మిలింద్‌నగర్ గ్రామాల్లో అశోక విజయ దశమి, ధమ్మ చక్రపవర్తన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బౌద్ధ ఉపాసకులు బుద్ధ, ధమ్మ, సంఘ వందనం స్వీకరించారు. అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, నాయకులు మారుతి, వాగ్మారే కామ్‌రాజ్, ఉత్తం, నాగోరావ్, సావంత్ రాజవర్ధన్ ఉన్నారు.

# 'ప్రజా ధనాన్ని లూటీ చేశారు'

బేల: ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ప్రజాధనాన్ని లూటీ చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాయల్ శంకర్ పేర్కొన్నారు. మండలంలోని సదల్‌పూర్ బైరందేవ్, మహాదేవ్ ఆలయాల్లో మంగళవారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత చప్రాల గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే జోగు రామన్న ప్రజలకు చేసిందేమి లేదని, కోట్ల రూపాయలు ఆస్తులు సంపాదించుకున్నారని ఆరోపించారు. పేదలకు ఇళ్లు, నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులకు పూర్తిస్థాయి రుణమాఫీ చేయలేదన్నారు. తెలంగాణలో ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని, ఆదిలాబాద్ ప్రజలకు అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని పేర్కొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, నాయకులు ఠాక్రే మురళీధర్, బోనిగిరివార్ గణేశ్, ఓల్లఫ్‌వార్ జ్యోతి, ఠాక్రే సందీప్, వడ్డె పోశెట్టి, శివకుమార్, కృష్ణ, వెంకటి తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న పాయల్ శంకర్

# ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యం

ఇంద్రవెల్లి: ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యమని బీజేపీ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి నేత, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. మండలంలోని హర్కపూర్‌తాండ గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ముందుగా జగదాంబ, సేవాలాల్ ఆలయంలో గ్రామస్తులతో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల సంక్షేమమే తమ పార్టీ ఎజెండా అన్నారు. నిరుపేదల కోసం కేంద్రం వివిధ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. అంతకుముందు గ్రామస్తులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మరప రాజు, నాయకులు ముండే రాజేశ్వర్, రాథోడ్ భీంరావ్ తదితరులు పాల్గొన్నారు.


రాథోడ్ రమేశ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

# ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

నేరడిగొండ: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బీఆర్‌ఎస్ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. దసరా పండగ సందర్భంగా మండల కేంద్రంలో ఆయన నివాసం వద్ద ప్రచార రథానికి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం పూజలు నిర్వహించారు. అనంతరం రాజుర గ్రామంలో గల జగదాంబ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బోథ్: బీఆర్‌ఎస్ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్‌ను గెలిపించాలని ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నక్కలవాడ, పట్నాపూర్, లక్ష్మీపూర్, రేండ్లపల్లె గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రకటించిన హామీలను గ్రామస్తులకు వివరించారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, అల్లకొండ ప్రశాంత్, రాజేశ్వర్, మహిపాల్, విజయ్, జుగాదిరావ్ పాల్గొన్నారు.

తాంసి: భీంపూర్ మండలంలోని గుబిడిలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారాన్ని ప్రారంభించారు. భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటా తిరుగుతూ వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ని ఆదరించాలని కోరారు. నాయకులు లస్మన్న, అనిల్, ప్రవీణ్, అఫ్రోజ్, నితిన్, నవీన్ ఉన్నారు.


పూజలో పాల్గొన్న అనిల్ జాదవ్

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బోథ్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే అనిల్‌జాదవ్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు ఎంపీపీ ప్రీతంరెడ్డి, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, నాయకులు గాడ్గే సుభాష్, మోహరాజ్ అహ్మద్, పాండురంగ్, రాజేశ్వర్‌రెడ్డి, అజీంసుల్తాన్, శిరీష్‌రెడ్డి, గంగాధర్, రమేశ్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

**అభివృద్ధిని చూసే పార్టీలో చేరికలు**

తాంసి: బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధిని చూసే పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నారని బీఆర్‌ఎస్ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. తలమడుగు మండలంలోని దేవాపూర్‌లో, భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామానికి చెందిన పలువురు యువకులు గ్రామ నాయకుడు వంశీ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరినవారికి అనిల్ జాదవ్ గులాబీ కండువా కప్పారు. నాయకులు శంకర్, లింబాజీ, సంజీవ్‌రెడ్డి, కల్చప్ తదితరులు ఉన్నారు.

సిరికొండ: బీఆర్‌ఎస్ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్‌ను గెలిపించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకుడు పెంటన్న ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఆటో యూనియన్లతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. నాయకులు ఎక్బాల్, తోకల చందు, సాయిని నర్సయ్య, జింక లక్ష్మణ్ పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌తో అభివృద్ధి**

బోథ్: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బోథ్ జెడ్పీటీసీ సంధ్యారాణి అన్నారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మణ్‌సింగ్, ఆత్మ చైర్మన్ సుభాష్, గ్రంథాలయ జిల్లా డైరెక్టర్ రమణగౌడ్, బీసీ సెల్ మండల అధ్యక్షులు బుచ్చన్న, రఫి, రవీందర్ యాదవ్, సత్యనారాయణ, దీటి దేవిదాస్, ప్రవీణ్, గంగాధర్, నాయకులు పాల్గొన్నార



### బతుకమ్మ సంబరాలు

బోథ్: మండల వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మున్నురుకాపు సంఘం ఆధ్వర్యంలో మహిళలు, యువతులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. అనంతరం నిమజ్జనం చేశారు.

### నాగోబాలో పూజలు


నాగోబా ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: దసరా వేడుకలు పురస్కరించుకుని మండలకేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో భక్తులు, కేస్లాపూర్ నాగోబా ఆలయంలో మెస్రం వంశీయులు పూజలు చేశారు. ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారం, సర్పంచ్ మెస్రం రేణుకనాగ్‌నాథ్, మెస్రం వంశం పెద్దలు మెస్రం కోసేరావ్, మెస్రం మనోహర్, మెస్రం శేఖర్‌బాబు ఉన్నారు.